# అమ్మా! నిషాదవిషాదం



"ష్! పిల్లలు లేస్తారు"

"మరేం ఫర్వాలేదు"

"అయినా నీకు ఇదేం బుద్ధి? లోకమంతా కళ్ళు తెరచుకుని మననే చూస్తోంది. ఇదెక్కడి చోద్యమమ్మా, ఓ వేళాపాళా లేదు!"

"ఎవరు మనల్నే పనికట్టుకుని చూసేది?"

"ఆ సూర్యుడు చూస్తున్నాడు– చెట్లు చూస్తున్నాయి. ఆకాశం చూస్తోంది. పిల్లలు ఏ క్షణాన్నయినా లేస్తారు!"

"చూడూ– సూర్యుడికి మరో పని లేదనుకున్నావా. ఆయనసలే ఒంటిచక్రం బండి. ఏడు గుర్రాలూ బలంగా లాక్కుపోతూ వుంటే, కాళ్ళు లేని సారథి అదుపు చేయలేక యాతన పడుతూ వుంటాడు. వెళ్ళవలసిన దూరం– ఉదయాద్రి నుంచి పశ్చిమాద్రి వరకు. ఉన్న సమయమూ చాలా తక్కువ. ఆయన బాధల్లో ఆయనుంటాడు. మనని చూసేంత తీరుబడి ఆయనకెక్కడిది?

చెట్లు చూస్తున్నాయంటావు.. చూస్తే మాత్రం ఏం చేస్తాయి. చూసింది ఎవరితోనైనా చెప్పగలవా?

ఆకాశమంటావా? ఎక్కడుంది ఆకాశం? మొన్న ఆ ఆశ్రమంలో స్వాములవారు శిష్యులకి చెప్పినట్టు– ఆకాశం అంటూ ఏదీ లేదుట. ఉంది అనుకోడం మన భ్రమ.

నడిమింటి జగ్గారావు

ఇకపోతే పిల్లలు. వాళ్ళకి ఇందాకేగా కడువు నిండా తిండిపెట్టాం. వాళ్ళు ఇవ్వడప్పడే లేవరు. అంచేత అడ్డుచెప్పక, రాకరాక వచ్చిన ఏకాంతాన్ని వృథా చెయ్యకుండా సద్వినియోగం చెయ్యి"

"అబ్బబ్బ! ఆ స్వాములవారి బోధ విన్న ప్పటినుంచీ మొదలుపెట్టావు ఏదన్నా కదిపితే చాలు పురాణంలా చెప్పకొస్తావు- చాల్చాలు! ఏమయినా సరే ఇప్పుడు కాదు!"

"అంతేనా?!"

"అంతే!"

"అంతే! అంతే!!"

"అవునులే నీకు నామీద ఏమైనా మనసుంటేగా?! మొదట్నుంచీ ఇంతే- ఎప్పుడు అడగ్గానే సరే అన్నావు?"

"అదిగో అదే వద్దన్నాను! ఏం? ఎప్పుడు కాదన్నాను?"

"ఎప్పుడు అవునన్నావు?!"

"ఆ! తీసుకున్నదంతా తీసుకుని ఇప్పడిలా..."

"ఏమిటంత తీసుకున్నదంతా?"

"అటు చూడు! ముగ్గురూ నీ పోలికలే! పొరపాట్న, మచ్చుకి కనీసం ఒక్కరికన్నా నా పోలికలున్నాయా?"

"దానికి నన్నేం చెయ్యమంటావ్? భగవంతుడు ఎలా పుట్టిస్తే అలా పుట్టారు. ఏం నా పోలికలతోనే పుట్టమని వాళ్ళకి ముందుగా నేనేమైనా చెప్పానా? పుట్టినప్పుడు వాళ్లు పెరిగాక నాలా వుంటారని కలగన్నానా?! ఏదో అదంతా నేను కావాలని చేసినట్టు మాట్లాడతావేమిటి అర్థం పర్థం లేకుండా?"

"నిన్ను నేనేమీ అనలేదు మహానుభావా- మీకు నేనేం ఇచ్చానో ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకోమంటున్నాను"

"ఆ మహా ఇచ్చావులే, అప్పుడూ ఇంతే- ఎప్పుడూ ముఖం ముడుచుకోవడం- కళ్లు మూసుకోవడం!"

"ముఖం ముడుచుకోలేదు- కళ్లు మాత్రం మూసుకున్నాను. కానీ ఇష్టం లేక కాదు- ఇష్టపడే!"

"ఏమీ కాదు!"

"అయితే ఇప్పడేమంటావు?"

"ఏవంటాను- ఏవనగలను? ఎంతసేపూ నా బలవంతమే కానీ- నీ అంతట నువ్వెప్పడేనా దగ్గరికి వచ్చావా?!"

"నా అంతట నేనే నీ దగ్గరికి వస్తే చులకన అయిపోతానని మా పుట్టింట్లో చెప్పారు- అందుకనీ..!"

"ఏడిశారు! అసలు నిన్ను కాదు వాళ్లని అనాలి. మొగుడు పెళ్ళాలం ఎలా వుండాలో నిర్ణయించాల్సింది వాళ్ళా లేక మనవా!? బుద్ధీ జ్ఞానం లేకపోతే సరి!"

"ఏం? ఎందుకలా వాళ్ళమీద విరుచుకు పడతావు? ఏం తక్కువ చేశారు? చక్కటి పెళ్ళాన్నిచ్చారు- నేను నీకు ముత్యాల్లాంటి వంశోద్ధారకుల్నిచ్చాను. నీతోపాటు అన్ని పనుల్లోను నేమా పాలు పంచుకుంటున్నాను. ఇంకేం కావాలయ్యా నీకు? అవకాశం దొరికితే చాలు మా వాళ్లని ఆడిపోసుకోవడమే!"

"అబబ్బో మీ వాళ్ళననేసరికి రోషం పొడుచుకొచ్చిందే?"

"ఏం మీ వాళ్లనంటే మీకు రాదా కోపం! నాకూ అమ్మా అబ్బా వున్నారు. అంత దిక్కులేని దాన్ని కాదు..."

"సర్లే! సర్లే! కెరటంలా లేచిన కోరికను నేలమట్టం చేశావు. ఇక నన్ను నువ్వు అనుకునీ ఇంతే- నిన్ను నేను అనుకునీ ఇంతే!"

"నేను మాత్రం ఏవన్నాను? పట్టపగలు- ఏ చాటూ లేకుండా... అడిగితే ఇబ్బందన్నాను- కాస్త నావైపునుంచి ఆలోచించొచ్చు కదా!"

"చాటెందుకే? చుట్టూ ఎవరేనా వుంటే కదా చాటూ మాటూను! అందరూ తిండి కోసం తిప్పలు పడడానికి పోయేరు- మళ్ళీ ఏ సాయంత్రమో ఆ సూర్యుడెళ్ళేక వస్తారు"

"అయితే ఇంతకీ ఏవంటావు?"

"ఏవంటాను? ఏవీ అనను"

"సరే! ఆ కోపం అలాగే వుంచుకో నాకేం?"

"నాకెందుకు కోపం? కోపం లేదు, తాపం లేదు"

"కోపం లేదు సరే! తాపం కూడా లేదా?"

"ఇందాకటుండేది- ఇప్పడు చల్లారిపోయింది.!"

"ఆ, మహాబెట్టు! అయినా చల్లారిన నీ తాపం ఎంతసేపట్లో రాజుకుంటుందో నాకు తెలీదా?"

"అవును! నీకు అన్నీ తెలుసు- అన్నీ తెలిసే నన్ను బొమ్మను చేసి ఆడిస్తున్నావు"

"నిన్నేమీ ఆడించడం లేదులేవయ్యా మహానుభావా! బెట్టు చాలించి ఇంక కొమ్మ దిగిరా"

"నేనేమీ కొమ్మెక్కి కూచోలేదు- నీ పక్కనే వున్నాను"

"నేనంటోంది ఆ బెట్టుసరి కొమ్మనుంచి దిగిరమ్మని!"

"నాకేమీ బెట్టు లేదు- అయినా బెట్టుచేస్తే తీర్చేవాళ్ళెవరున్నారు నాకు?"

"నేను లేనా? ఎన్నిసార్లు నీ బెట్టు తీర్చలేదు?"

"ఏమో! నాకేం గుర్తులేదు"

"పోనీ ఇప్పడు తీరుస్తాను- గుర్తుంచుకుంటావా?"




గురజాడ వీధి
శీర్షికలో
వచ్చేవారం
నాగంటి
నాగరాజారావు
సౌందర్యారాధన

కోడలు పిల్లా - కొత్త సలహా


మురికి మటుమాయం చేతులు మండవు ఎక్కువ ఖర్చు లేదు
బావి నీటితోకూడా ఉపయోగించవచ్చును.


త్రిపుల్ ఎక్స్ XXX
సూపర్ పవర్ డిటర్జంట్ కేక్
డిస్ట్రిబ్యూటర్స్
భారతీ సోప్ వర్క్స్
ఇందిరాగాంధీ నగర్, 1వ లైను,
(నల్లచెరువు) గుంటూరు-3.
ఫోన్ : 225833, 223154
సలహా పంపిన ఈ వారం కోడలు పిల్ల :
D. శివరంజని, పుంగనూర్.
ఇలాంటి సలహాలు ఏ కోడలుపిల్లయినా మా కంపెనీ ఎడ్రసుకు కార్డుమీద పూర్తి ఎడ్రసుతో పంపవలెను. నచ్చినవి ప్రచురిస్తాం.

"నిజంగానా?"
"ప్రతిదీ రెండేసిసార్లు చెప్పాలి నీకు! నిజంగా నేనయ్యా మగడా!"
"అయితే.."
"నీదే ఆలస్యం!"
"ఆ..!"
"ఆ."
"ఏది– ఇలా దగ్గరగా రా మరి"
"వచ్చాను– సరేనా?"
"అబ్బ నీ ఒళ్ళెంత వెచ్చగా వుందీ!"
"మరి నీఒంట్లో వేడివి ఎలా చల్లార్చడం?"
"అదేంటి ఇద్దరి వేడీ కలిపి ఇంకా వేడెక్కి పోదూ!"
"నువ్వే చెప్పావుగా, స్వాములారు చెప్పారనీ 'ఉష్ణం ఉష్ణేన శీతలం..."
"నిజమే సుమా! తరువాత అంతా హాయిగా, చల్లగానే వుంటుంది"
"అవును."
"ఇవాళ నాకు ఇంతకుముందెప్పుడూ లేనంత తృప్తిగా వుంది"
"నాక్కూడా"
"ఎందువల్లంటావు?"
"ముందు పోట్లాటయింది కదా మనిద్దరికీ– పోట్లాట తర్వాతి కలయిక ఇలాగే వుంటుంది"
"అయితే ఇకముందు ఎప్పుడూ నీతో పోట్లా టేసుకుంటాను"
"నీకేం పోయింది. నీకు పోట్లాడ్డానికి ఓపి కుంది. నాకు లేదు– అబ్బ నీ రెక్కలెంత మోటుగా వున్నాయో!"
"రెక్కల కష్టంమీద బతికేవాణ్ణి – అవి గట్టిగా వుండకపోతే ఎలాగ?"
"మరీ ఇంత గట్టిగానా?"
"అవి గట్టిగా వున్నంతసేపే మన బ్రతుకు– తర్వాత..."
"చాలు. ఇంక చెప్పకు– విని తట్టుకోగలిగే శక్తి లేదు నాకు"
"ఎందుకు?"
"ఇలా నీ రెక్కల మధ్యనే నేను కన్ను మూయాలి– నిన్నూ, నేను నీకిచ్చిన బిడ్డల్నీ కళ్ళారా చూసుకుంటూ నేను వెళ్ళిపోవాలి– ఈ జీవితానికి ఆ ఒక్క వరం ప్రసాదించు చాలు!"
"ఊరుకో! ఇలాంటి సమయంలో అలాంటి మాటలెందుకు"
"మనసులో మాట బయటకొచ్చింది– క్షమించు"
"నీతో ఇదే వచ్చిన చిక్కు– ఎక్కణ్ణించి ఎక్కడికో వెళ్ళిపోతావు"
"సరే లెద్దూ ఏదో అనేశాను!"
"ఒకవేళ నేనే ముందుగా పోతే?!"
"దయచేసి అలాంటి మాటలు మళ్ళీ అనొద్దు– అలా ఎన్నటికీ జరగదు"
"ఏమో! మన చేతిలో ఏముంది?"
"అనొద్దన్నానా?"
"సరే– అననులే"
వాటి సంభాషణను భంగపరుస్తూ గాలి చీలుతున్న శబ్దం వినిపించింది. రెప్పపాటులో వాడిగా వున్న బాణం మగపక్షి గుండెలో దూసుకుపోయి నేలకూల్చింది.
"మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమ శాశ్వతీ సమాహ
యత్క్రౌంచ మిధునా దేకం! అవధీః కామ మోహితం"
ఆర్ద్రత నిండిన కంఠస్వరం వినిపించింది.
"ఇది ఆ నది ఒడ్డున వున్న స్వాములవారి గొంతు!" అనుకుంటూ వుండగా మగపక్షి తల పక్కకి వాలిపోయింది.




# జ్ఞానతత్వం

సంసారం అనే సమరం చేసాక, మోక్షం అనే విజయం లభిస్తుంది అంటారు రామకృష్ణ పరమహంస. యుద్ధానికి ముందు సిపాయిలు చేసే కవాతులు, కసరత్తులు లాగే జ్ఞాన సముపార్జనకు ముందు సంసారమనే కసరత్తు చేయాల్సి వుంటుంది.

దండన, దయ, దండించేవాడు, దయదలిచేవాడు జ్ఞాని దృష్టిలో సమానమే. ఒకసారి ఒక సత్యాన్వేషి అయిన సన్యాసి ఒక వీధి గుండా వెడుతూ వున్నాడు. ఆ వీధిలో ఒక యజమాని తన నౌకరును అదే పనిగా బెత్తంతో బాదుతుంటే చూడలేక సత్యాన్వేషి అతడ్ని కొట్ట వద్దని, సంగతి ఏమిటని? అడిగాడు. నౌకరు తప్పు చేసాడని, దండిస్తున్నానని అన్నాడు యజమాని. దానికా సత్యాన్వేషి మరి ఇక దండించవద్దని అంటూ ఆ నౌకరుని తప్పించాడు. కానీ యజమాని, నౌకరుని తప్పించిన సత్యాన్వేషిని చితకబాదాడు. పాపం సత్యాన్వేషి స్పృహ తప్పిపోయాడు. చివరకు ఒక పెద్దమనిషి వచ్చి యజమానిని తిట్టి సత్యాన్వేషి ముఖంపై నీరు జల్లి స్పృహ వచ్చాక పాలు ఇచ్చి త్రాగమన్నాడు.

కొంచెంసేపటికి తెప్పరిల్లిన సత్యాన్వేషిని ''నన్ను గుర్తుపట్టారా?'' అని ఆ పెద్దమనిషి అడిగితే, నన్ను బాదిన యజమానిలోనూ, నీలోనూ కూడా ఆ పరాత్పరుని చూస్తున్నాను. మీ ఇరువురికి గల తేడా నాకు తెలియడం లేదు'' అన్నాడు సత్యాన్వేషి.

సత్యాన్వేషి నిజమైన జ్ఞానతత్వానికి అందరూ నమస్కరించి సత్కరించారు.

– జె.ఎస్.